జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
మహబూబ్‌నగర్
నాగర్ కర్నూల్, వనపర్తి
జోగులాంబ గద్వాల
నారాయణపేట
ఆదివారం 21 జూన్ 2026 ♦ పేజీలు : 7

# పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

- జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జి పాటిల్



**నాగర్ కర్నూల్ ,జూన్ 20 (ప్రజా జ్యోతి)** రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వనమహోత్సవ కార్యక్రమాన్ని రాష్ట్ర ఎక్సైజ్ మరియు పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు చేతుల మీదుగా శనివారం జిల్లా ఇందిరా మహిళా శక్తి భవన్ సమీపంలో ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ పాటిల్,ఎక్సైజ్–పర్యాటక శాఖ మంత్రి మంత్రి జూపల్లి కృష్ణారావు, పార్లమెంట్ సభ్యులు మల్లురవి, ఎమ్మెల్యే డా.రాజేష్ రెడ్డి తో కలిసి

మిగతా 2 లో...




# చదువుతోనే ఉజ్వల భవిష్యత్

- మైనార్టీ గురుకులాల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం: మంత్రి మహ్మద్ అజారుద్దీన్

**మహబూబ్‌నగర్, జూన్ 20 (ప్రజా జ్యోతి బ్యూరో)** చదువుతోనే ఉజ్వల భవిష్యత్ సాధ్యమవుతుందని, విద్యార్థులు కష్టపడి చదివి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని రాష్ట్ర మైనార్టీ సంక్షేమ, ప్రభుత్వ రంగ సంస్థల శాఖ మంత్రి Mohammed Azharuddin అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని బోయపల్లిలో రూ.20 కోట్ల వ్యయంతో నిర్మించిన తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ బాలికల పాఠశాల భవనం,రూ.2.10కోట్లతో నిర్మించిన బాలికల వసతి గృహ భవనాన్ని మంత్రి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే Yennam Srinivas Reddyతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి A. Revanth Reddy నాయకత్వంలో ప్రభుత్వం మైనార్టీ విద్యార్థుల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తోందన్నారు. ప్రాథమిక స్థాయిలో పొందిన విద్యే ఉన్నత విద్యకు పునాదిగా నిలుస్తుందని పేర్కొన్నారు. విద్యార్థినులు చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపి మంచి ఫలితాలు సాధించాలని, వారి విద్య ఒక కుటుంబానికే కాకుండా ఒక తరం అభివృద్ధికి దోహదపడుతుందని తెలిపారు.విద్యతో పాటు ఆరోగ్యం కూడా ముఖ్యమని, గురుకులాల్లో పౌష్టికాహారం అందించాలని సూచించారు. గురుకుల విద్యార్థులు ఐఏఎస్, ఐపీఎస్ వంటి ఉన్నత ఉద్యోగాలను లక్ష్యంగా పెట్టుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో మైనార్టీ పాఠశాలలు అద్దె భవనాల్లో నడవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి చొరవతో కేంద్ర ప్రభుత్వ నిధులు విడుదల చేయించడంతో ఈ పాఠశాల నిర్మాణం సాధ్యమైందని తెలిపారు. మహబూబ్‌నగర్ అభివృద్ధికి గత రెండున్నర సంవత్సరాల్లో సుమారు రూ.2,000 కోట్ల నిధులు తీసుకువచ్చామని పేర్కొన్నారు. ఐఐఐటీ, లా,

మిగతా 2 లో...

# ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి




ప్రతి దశను క్షేత్ర స్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలి

:: సుదర్శన్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి

- స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)–2026 ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు

**నారాయణపేట ప్రతినిధి జూన్ 20 ప్రజాజ్యోతి** శుక్రవారం ఎస్ఐఆర్ ప్రక్రియ నిర్వహణపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశానికి జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ ప్రియాంక హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, అన్ని జిల్లాల్లో ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఎన్యుమరేషన్ ఫారమ్‌ల పంపిణీ, వాటి తిరిగి స్వీకరణ, ఓటరు వివరాల ధృవీకరణ

మిగతా 2 లో...

# గొప్ప లక్ష్యాలను నిర్దేశించుకుని చదవాలి

- కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక



**నారాయణపేట ప్రతినిధి జూన్ 20 ప్రజా జ్యోతి** గొప్ప లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని చేరుకునేందుకు నిత్య సాధన చేయాలని జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక సూచించారు. సివిల్స్ ,గ్రూప్ –1 పరీక్షలంటే భయపడాల్సిన అవసరం లేదని, 9 వ తరగతి నుంచి ఇంటర్ మీడియట్ వరకు ఉన్న సైన్స్, మ్యాస్, సోషల్ పుస్తకాలలోని ప్రశ్నలే ఆయా పోటీ పరీక్షల్లో వస్తాయని, అందుకే ఇప్పుడే తరగతి గదుల్లో టీచర్లు చెప్పే పాఠ్యాంశాలను శ్రద్ధగా విని, అర్థం కానీ సబ్జెక్టుల ను మళ్ళీ మళ్ళీ అడిగి నేర్చుకోవాలని ఆమె చెప్పారు. జిల్లా కలెక్టర్ శనివారం మరికల్ మండలం పస్పుల గ్రామానికి వెళ్లే మార్గంలో గల కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల ను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని లైబ్రెరీ గదిని, స్టోర్ రూమ్ ను చూశారు. స్టోర్ రూమ్ లో

మిగతా 2 లో...

# రబీ ధాన్యం కొనుగోళ్లు విజయవంతంగా పూర్తి

- 21,585 మంది రైతుల ఖాతాల్లో రూ.265 కోట్లు జమ
- మిగిలిన చెల్లింపులు మూడు రోజుల్లో



**మహబూబ్‌నగర్, జూన్ 20 ( ప్రజా జ్యోతి బ్యూరో)** రబీ 2025–26 సీజన్‌లో మహబూబ్‌నగర్ జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) ప్రకారం జిల్లా వ్యాప్తంగా 180 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతుల నుంచి ధాన్యాన్ని సేకరించినట్లు వెల్లడించారు. ఐకేపీ, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (పీఏసీఎస్), మెప్మా ఆధ్వర్యంలో నిర్వహించిన కొనుగోలు కేంద్రాల ద్వారా మొత్తం 22,414 మంది రైతుల నుంచి 1,16,345.800 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఇందులో 41,996 మెట్రిక్ టన్నుల సన్న రకం ధాన్యం, 74,349.800 మెట్రిక్ టన్నుల

మిగతా 2 లో...

## చదువుతోనే ఉజ్వల భవిష్యత్



(మొదటి పేజీ తరువాయి...)

ఇంజినీరింగ్ కళాశాలలు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజ్, రోడ్లు, శాశ్వత తాగునీటి వంటి మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. యువతకు ఉపాధి అవకాశాల కల్పన కోసం అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్లు, స్కిల్ యూనివర్సిటీ వంటి కార్యక్రమాలు అమలు చేస్తున్నామని చెప్పారు. మహబూబ్‌నగర్ ఎంపీ D. K. Aruna మాట్లాడుతూ విద్యా ప్రమాణాల పెంపు, మౌలిక సదుపాయాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తోందన్నారు. మైనార్టీ విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని విద్యలో రాణించాలని సూచించారు. మైనార్టీ పాఠశాల ప్రాంగణంలో ప్రహరీ గోడతో పాటు మరిన్ని మౌలిక సదుపాయాల కోసం అవసరమైన నిధులు తీసుకురావడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మహబూబ్‌నగర్‌లో మరో రెండు మైనార్టీ పాఠశాలల ఏర్పాటుకు కూడా కేంద్ర ప్రభుత్వ సహకారం అందేలా ప్రయత్నిస్తానన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్, తెలంగాణ రాష్ట్ర మైనార్టీ గురుకుల విద్యా సంస్థల సొసైటీ వైస్ చైర్మన్, ప్రెసిడెంట్ ఫహీం ఖురేషి, జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, మేయర్ మమత, డిప్యూటీ మేయర్ సురేందర్ రెడ్డి, సొసైటీ కార్యదర్శి షఫియుల్లా, మార్కెట్ కమిటీ చైర్మన్ అనితా మధుసూదన్ రెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ రెడ్డి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ సాయి శివాని తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

(మొదటి పేజీ తరువాయి...)

ఎస్పీ ఎస్పీ డాక్టర్.సంగ్రామ్ సింగ్ జి పాటిల్ పాల్గొని మొక్కను నాటారు.ఈ సందర్భంగా ఎస్పీ సంగ్రామ్ సింగ్ పాటిల్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటి,వాటిని సంరక్షించాలని,పచ్చదనాన్ని పెంపొందించడంతో పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించవచ్చని,ఆరోగ్యక రమైన జీవనవిధానాన్ని సాధించవచ్చని అన్నారు అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా అన్ని పోలీస్ స్టేషన్లో నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగర్ కర్నూల్ మున్సిపల్ చైర్మన్ తీగల సురేంద్ర, జిల్లా అటవీ శాఖ అధికారి రేవంత్ చంద్ర, అదనపు కలెక్టర్ అమరేందర్, పిడి డిఆర్డిఏ చిన్న ఓబులేసు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి




(మొదటి పేజీ తరువాయి...)

తదితర ప్రక్రియలను ఎలాంటి లోపాలకు తావులేకుండా నిర్వహించాలని సూచించారు. బూత్ లెవల్ అధికారులకు (బీఎల్‌వోలు) ప్రక్రియకు సంబంధించిన ప్రతి అంశంపై పూర్తి అవగాహన ఉండాలని తెలిపారు. జిల్లాల వారీగా ఎస్ఐఆర్ అమలుకు చేపట్టిన చర్యలు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశాల వివరాలను కలెక్టర్లను అడిగి తెలుసుకున్నారు. మొత్తం ప్రక్రియను జిల్లా కలెక్టర్లు, ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో భాగంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తిస్థాయిలో పకడ్బందీగా నిర్వహిస్తామని, ప్రతి దశను నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపడతామని వివరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీను ఆర్డీవో రమేష్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రబీ ధాన్యం కొనుగోళ్లు విజయవంతంగా పూర్తి

(మొదటి పేజీ తరువాయి...)

దొడ్డు రకం ధాన్యం ఉన్నట్లు పేర్కొన్నారు. ధాన్యం విక్రయించిన రైతులకు వేగంగా చెల్లింపులు జరుగుతున్నాయని, ఇప్పటివరకు 21,585 మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో సుమారు రూ.265 కోట్లు జమ చేసినట్లు తెలిపారు. మిగిలిన రైతులకు సంబంధించిన సుమారు రూ.12 కోట్ల చెల్లింపులు కూడా రానున్న మూడు రోజుల్లో విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. ఈ సీజన్‌లో భారీ వర్షాలు, రవాణా సమస్యలు, రైస్ మిల్లుల్లో అన్‌లోడింగ్ ఇబ్బందులు వంటి అనేక సవాళ్లు ఎదురైనప్పటికీ జిల్లా యంత్రాంగం సమన్వయంతో వాటిని అధిగమించి కొనుగోళ్లను విజయవంతంగా పూర్తి చేసినట్లు కలెక్టర్ తెలిపారు. భారీ వర్షాల సమయంలో ధాన్యం తడిసిపోకుండా అదనపు టార్పాలిన్లు అందుబాటులో ఉంచడంతో పాటు, తడిసిన ధాన్యాన్ని సమీప బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలించి రైతులకు నష్టం జరగకుండా చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. కొన్ని రైస్ మిల్లుల్లో దిగుమతి సమస్యలు తలెత్తిన సందర్భాల్లో ప్రత్యేక అధికారులను నియమించి లారీలను సకాలంలో ఖాళీ చేయించారని తెలిపారు. ధాన్యం నాణ్యతకు సంబంధించిన తేమ శాతం, తాలు, నాన్-ఎఫ్ఏక్యూ అంశాలపై రైతులకు అవగాహన కల్పించి సమస్యలను క్షేత్రస్థాయిలోనే పరిష్కరించినట్లు చెప్పారు. లారీల కొరత తలెత్తిన సమయంలో రవాణా శాఖ సహకారంతో అదనపు వాహనాలను సమకూర్చి కొనుగోలు కేంద్రాలకు పంపించడం ద్వారా రైతులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకున్నట్లు వివరించారు. ప్రతి రోజూ వాతావరణ పరిస్థితులను పర్యవేక్షిస్తూ కొనుగోలు కేంద్రాలకు అవసరమైన సూచనలు జారీ చేసినట్లు తెలిపారు. జిల్లా స్థాయి అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించడం, రైస్ మిల్లర్లతో సమన్వయం కొనసాగించడం ద్వారా కొనుగోలు ప్రక్రియ సజావుగా సాగిందన్నారు. రైతులు పండించిన ప్రతి గింజకు గిట్టుబాటు ధర అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది సమిష్టి కృషితో ధాన్యం కొనుగోళ్లు విజయవంతంగా పూర్తయ్యాయని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా రైతులు, ఐకేపీ మహిళా సంఘాలు, మెప్మా సిబ్బంది, పీఏసీఎస్ నిర్వాహకులు, రైస్ మిల్లర్లు, రవాణా కాంట్రాక్టర్లు, పౌర సరఫరాల శాఖ, రెవెన్యూ, వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, పోలీసు, రవాణా శాఖల అధికారులు, సిబ్బందిని జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు.

## రాష్ట్ర మంత్రి మహ్మద్ అజారుద్దీన్‌కు ఘన స్వాగతం

- **డీసీసీ అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో సన్మానం**



**మహబూబ్‌నగర్, జూన్ 20 ( ప్రజా జ్యోతి బ్యూరో )** తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొనేందుకు మహబూబ్‌నగర్‌కు విచ్చేసిన రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి మొహమ్మద్ అజహరుద్దీన్ కు జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజ్ ఘన స్వాగతం పలికారు. శనివారం మహబూబ్‌నగర్‌లోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు మంత్రిని ఆత్మీయంగా ఆహ్వానించారు. మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాల ప్రారంభోత్సవ కార్యక్రమం అనంతరం మంత్రి మహ్మద్ అజారుద్దీన్ మహబూబ్‌నగర్ జిల్లా కాంగ్రెస్ కార్యాలయాన్ని సందర్శించారు. అక్కడ పార్టీ కార్యకర్తలు, నాయకులతో సమావేశమై పలు రాజకీయ, అభివృద్ధి అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్, జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, మేయర్ గుమ్మాల మమత శ్రీనివాస్, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బెక్కరి అనిత మధుసూదన్ రెడ్డి, నగర డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి, కార్పొరేటర్ ప్రవీణ్ కుమార్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు వినోద్ కుమార్, సిరాజ్, ఎస్సీ సెల్ చైర్మన్ పసుల రాజు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అవేజ్, డీసీసీ సభ్యులు సత్తూర్ చంద్రకుమార్ గౌడ్, బెక్కెరి మధుసూదన్ రెడ్డి, మినాజుద్దీన్, టీపీసీసీ అధికార ప్రతినిధి జాహిద్ అక్తర్ తదితరులు పాల్గొన్నారు.

## గొప్ప లక్ష్యాలను నిర్దేశించుకుని చదవాలి



(మొదటి పేజీ తరువాయి...)

కూరగాయలు, పండ్లను, ఇతర నిత్యావసర సరుకులను పరిశీలించారు. కూరగాయలు తాజాగా లేవని, సంబంధిత కాంట్రాక్టర్ కు చెప్పి తాజా కూరగాయలను సరఫరా చేసేలా ఆదేశాలు జారీ చేయాలని జిల్లా విద్యా శాఖ అధికారికి, ఆ పాఠశాల ఎస్. వో రాజ్యలక్ష్మి కి సూచించారు. పక్కనే ఉన్న వంట గదిలోకి వెళ్ళిన కలెక్టర్ మధ్యాహ్న భోజనం కోసం వండిన అన్నం, సాంబారు, పప్పు, గుడ్లను పరిశీలించారు. మెనూ జాబితాను చూసి శనివారం మెనూలో కర్రీ కూడా ఉంది కదా అని వంట ఏజెన్సీ నిర్వాహకులను ప్రశ్నించగా, వంకాయ కర్రీ చేస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. అనంతరం పదో తరగతి గదిలోకి వెళ్ళిన కలెక్టర్ విద్యార్థినులతో ఇంట్రాక్ట్ అయ్యారు. అన్ని పాఠ్య, రాత పుస్తకాలు వచ్చాయా అని అడిగి తెలుసుకున్నారు. ఇంగ్లీష్ పాఠాన్ని విద్యార్థినులతో చదివించారు. భవిష్యత్ లో మీరేం కావాలని అనుకుంటున్నారని వారిని ఆమె ప్రశ్నించగా, చాలా మంది విద్యార్థినులు అగ్రికల్చర్ అధికారులం అవుతామని తెలిపారు. పదో తరగతి పరీక్షలలో 550 కి పైగా మార్కులు ఎవరెవరు తెచ్చుకుంటారో చెప్పండి అని అడిగిన కలెక్టర్ కు మొత్తం తరగతి గదిలో ఉన్న విద్యార్థినులంతా చేతులెత్తి ధీమా వ్యక్తం చేశారు. చివరగా కలెక్టర్ మాట్లాడుతూ.. పదో తరగతి పరీక్షలలో పాఠశాల టాపర్ గా నిలిచిన విద్యార్థినికి తాను ప్రత్యేక బహుమతి ఇస్తానని కలెక్టర్ ప్రకటించారు. గొప్ప గొప్ప లక్ష్యాల కోసం కలలు కనాలని, వాటిని సాకారం చేసుకునేందుకు ప్రణాళిక బద్ధంగా చదవాలని కలెక్టర్ పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ రామ్ కోటి, ఎంపీడీవో పృథ్వీరాజ్, తదితరులు పాల్గొన్నారు.

## నారాయణపేట జిల్లా కోర్ట్ ప్రాంగణంలో రాజి మార్గం ద్వారా 5300 కేసుల పరిష్కరణ

- **జిల్లా ప్రధాన న్యాయమూర్తి బోయ శ్రీనివాసులు.**

**నారాయణపేట ప్రతినిధి జూన్ 20 ప్రజా జ్యోతి** శనివారం నాడు తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ ఆదేశాల మేరకు నారాయణపేట జిల్లా న్యాయ సేవ సంస్థ, లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో నారాయపేట జిల్లా ప్రాంగణంలో 5 బెంచులను ఏర్పాటు చేసి, ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి కం చైర్మన్ లీగల్ సర్వీసెస్ అథారిటీ నారాయణపేట బోయ శ్రీనివాసులు మరియు లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి కం సీనియర్ సివిల్ జడ్జి వింధ్య నాయక్, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి బి.సాయి మనోజ్, మరియు అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కే.అవినాష్, జూనియర్ సివిల్ జడ్జి మక్తల్ సుష్మిత, మరియు ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి మురళీధర్ హాజరై శనివారం నారాయణపేట,మక్తల్ మరియు కోస్గి కోర్టు ఆవరణలలో జరిగిన రెండవ జాతీయ లోక్ అదాలత్ లో అన్ని కోర్టుల పరిధిలో 5300 కేసులను రాజీ మార్గం ద్వారా పరిష్కరించారు. జిల్లాలో 14 పోలీస్ స్టేషన్లతో పాటు రెండు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ల (కోస్గి, నారాయణపేట మరియు మక్తల్) పరిధిలో



ఉన్న కేసులకు న్యాయవాదులు సహకరించి పరిష్కారానికి కృషి చేశారు అన్నారు. కాగా మొత్తం కేసుల పరిష్కారానికి గాను రూ 44,57,474/- ఆదాయం ప్రభుత్వానికి సమకూరిందని ప్రధాన న్యాయమూర్తి గారు తగిన అవార్డులు కక్షిదారులకు అందచేశారు తెలియజేశారు . ఈ కార్యక్రమంలో నారాయణపేట బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ దామోదర్ గౌడ్, సీతారామారావు, నందు నామాజీ, పి.సతీష్ కుమార్, కే. నవీన్ గౌడ్ ఇతర న్యాయవాదులు, కక్షిదారులు, పోలీసు అధికారులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

# గద్వాల ట్రాఫిక్ విభాగంపై జిల్లా ఎస్పీ ఆకస్మిక తనిఖీ

- క్రమశిక్షణ,నీట్ టర్నౌట్,ప్రజలకు మెరుగైన సేవలపై సిబ్బందికి సూచనలు





**గద్వాల జూన్ 20 (ప్రజా జ్యోతి ప్రతినిధి):** జోగులాంబ గద్వాల జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు శనివారం గద్వాల టౌన్ ట్రాఫిక్ విభాగాన్ని ఆకస్మికంగా సందర్శించి తనిఖీ నిర్వహించారు.ఈ సందర్భంగా ట్రాఫిక్ వింగ్ పరిసరాలు,వాహనాల పార్కింగ్ ప్రదేశాలు, సిబ్బంది విధుల నిర్వహణ తీరును క్షుణ్ణంగా పరిశీలించారు.అనంతరం ట్రాఫిక్ సిబ్బందితో నేరుగా మాట్లాడిన ఎస్పీ,వారి రోజువారీ విధులు,బాధ్యతల గురించి ఆరా తీశారు.ట్రాఫిక్ ఆర్ఎస్ఐ బాల చంద్రుడిని ట్రాఫిక్ నియంత్రణ చర్యలు,విధుల నిర్వహణపై ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు.ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడంలో ట్రాఫిక్ విభాగం కీలక పాత్ర పోషిస్తుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు.ఎస్పీ మాట్లాడుతూ,ట్రాఫిక్ పోలీసుల వైఖరి,బాడీ లాంగ్వేజ్,యూనిఫాం ధరించే తీరు (నీట్ టర్నౌట్),క్రమశిక్షణ వంటి అంశాలు పోలీస్ శాఖ ప్రతిష్ఠను ప్రతిబింబిస్తాయని అన్నారు.ప్రతి పోలీసు సిబ్బంది ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ,నిబద్ధతతో విధులు నిర్వర్తించాలని సూచించారు. ట్రాఫిక్ విభాగం పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని,సిబ్బంది తమకు కేటాయించిన ట్రాఫిక్ పాయింట్లలో అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు.ముఖ్యంగా రద్దీ సమయాల్లో ట్రాఫిక్‌ను సమర్థవంతంగా నియంత్రించి,రోడ్డు వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ తనిఖీలో గద్వాల డీఎస్పీ వై. మొగిలయ్య,గద్వాల సీఐ టంగుటూరి శ్రీను,ట్రాఫిక్ ఆర్ఎస్ఐ బాలచంద్రుడు తదితర ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

## రైతుల సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీసిన బీఆర్ఎస్ నాయకులు



**గద్వాల (ప్రజా జ్యోతి) జూన్ 20:** శనివారం గద్వాల జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో బీఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జి బాసు హనుమంతు నాయుడు,మాజీ మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్ పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలపై తీవ్ర విమర్శలు చేశారు. పంటల కొనుగోలు, రైతుభరోసా,రైతుబీమా, రుణమాఫీ,ఎరువులు, విద్యుత్ సరఫరా తదితర అంశాల్లో ప్రభుత్వం వైఫల్యం చెందిందని ఆరోపించారు.తెలంగాణ రైతులు పండించే ప్రతి పంటను చివరి గింజ వరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ,రైతుల హక్కుల కోసం బీఆర్ఎస్ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర రెడ్డి,జి. రాఘవేంద్ర రెడ్డి,శ్రీనివాస్ గౌడ్,బీచుపల్లి సూర్య గౌడ్,రాజారెడ్డి,మోనేష్, సోమశేఖర్ రెడ్డి,శ్రీరాములు,చక్రీధర్ రెడ్డి, తిమ్మప్ప గౌడ్,లక్ష్మారెడ్డి,వీరేష్ గౌడ్,సురేష్,గొనుపాడు మాలిక్,రమేష్,డ్యామ్ శ్రీను,జగదీశ్,రజిని బాబు,నరసింహులు,వెంకటేష్,మహేష్,వీరేష్,రవి,మోహన్ తదితర పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## కళాశాల అభివృద్ధికి ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి హామీ



**మల్దకల్ జూన్ 20(ప్రజా జ్యోతి):** మల్దకల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృద్ధి కార్యక్రమాలకు గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీలత రెడ్డి ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి కళాశాల అభివృద్ధికి సంబంధించిన వినతిపత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా శ్రీలత రెడ్డి మాట్లాడుతూ,ఎమ్మెల్యే సహకారంతో రాబోయే రోజుల్లో కళాశాలలో పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టనున్నట్లు తెలిపారు.ఈ విద్యాసంవత్సరంలో ప్రభుత్వం విడుదల చేసిన రూ.12 లక్షల నిధులతో కళాశాల భవనం పైకప్పుకు కాంక్రీట్ వేయించి,పెచ్చులు ఊడిపడకుండా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు.అలాగే తరగతి గదుల మరమ్మతులు, గోడలు,కిటికీల పునరుద్ధరణ,గ్రీన్ బోర్డుల ఏర్పాటు,ఫర్నిచర్ సమకూర్చడం,తరగతి గదులకు రంగులు వేయించడం ద్వారా విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించినట్లు వివరించారు. అదేవిధంగా కళాశాలలో ఇంకా ఉన్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.ముఖ్యంగా రోడ్డు మట్టానికి దిగువన ఉన్న కళాశాల ప్రాంగణాన్ని ఎర్ర మట్టితో చదును చేయడం,విద్యార్థుల భద్రత కోసం కారిడార్లకు గ్రిల్స్ ఏర్పాటు చేయడం, కళాశాల వెనుక భాగంలో ఉన్న పెద్ద కాలువను కాంక్రీట్‌తో నిర్మించడం వంటి అవసరాలపై వినతిపత్రం సమర్పించినట్లు పేర్కొన్నారు.వినతిపత్రాన్ని స్వీకరించిన ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి,తక్కువ కాలంలోనే కళాశాల అభివృద్ధి కోసం ప్రిన్సిపాల్ చేసిన కృషిని అభినందించారు.కళాశాల ప్రాంగణాన్ని త్వరలోనే మట్టితో చదును చేయడంతో పాటు ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు కూడా తమ పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చినట్లు ప్రిన్సిపాల్ శ్రీలత రెడ్డి తెలిపారు.

## వ్యవసాయ కళాశాలలో ఘనంగా యోగ దినోత్సవం



**నాగర్ కర్నూల్ : జూన్ 20 (ప్రజా జ్యోతి )** నాగర్ కర్నూల్ నియోజకవర్గంలోని పాలెంలోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విద్యాలయంలో కళాశాల అసోసియేట్ డిన్ డాక్టర్.వి. హేమలతఆధ్వర్యంలో శనివారం 12వ,అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి అతిథిగా యోగా గురువు,ప్రభుత్వ ఆయుష్ యోగా శిక్షకుడు ఎన్.శివప్రసాద్ పాల్గొన్నారు. అసోసియేట్ డీన్ డా.వి.హేమలత మాట్లాడుతూ యోగా శారీరక మరి యు మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో కీలక పాత్రపోషిస్తుందని,యోగాను జీవితంలో భాగంగా చేసుకోవడంతో ఒత్తిడి తగ్గించుకొని ఆరోగ్యకర జీవనాన్ని గడపవచ్చన్నారు. యోగ నిపుణులు వివిధ యోగాసనాలు,ప్రాణాపాయ సాధన, సూర్య నమస్కారాలను ప్రదర్శించి వాటి ప్రయోజనాలను వివ రించారు.ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది పాల్గొని విజయవంతం చేశారు.

## డివైడర్ కు పెప్సీలు పెట్టడం వలన ప్రజలకు యాక్సిడెంట్ ప్రమాదాలు







**కొల్లాపూర్ జూన్ 20 ప్రజా జ్యోతి** కొల్లాపూర్ నియోజక వర్గంలో ఎన్టీఆర్ చివరస్త దగ్గర ఉన్న డివైడర్ రెండు సైడ్ల ప్రైవేట్ స్కూల్ యాజమాన్యం భారీ ఫ్లెక్సీలు పెట్టడం వలన కొల్లాపూర్ పట్టణం లోపలికి రాకపోకలకు ప్రజలకు వాహనాలకు ఇబ్బందిగా ఉందని స్థానిక ప్రజలు వివరించారు. అక్కడ టర్నింగ్ పాయింట్ ఉన్నది అదేవిధంగా నాలుగు రోడ్లు ఉండడం వలన ప్రజలు అటువైపు ఇటువైపు వెళ్లే దారి కాబట్టి వచ్చి పోయే వాహనాలను గమనించని యువత ప్రజలు అనుకోకుండా యాక్సిడెంట్ జరిగే ప్రమాదాలు కనపడుతున్నాయి. ఇట్టి విషయం పైన స్థానిక ప్రజలు వివరించారు, అనంతరం కొల్లాపూర్ మున్సిపాలిటీ కమిషనర్ తెలిసి తెలియనట్లు వ్యవహరిస్తున్న పనితీరును స్థానిక యువకులు ప్రజల ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రైవేటు యాజమాన్యం స్కూలు అడ్వర్టైజ్మెంట్ కొరకు ఫ్లెక్సీలు పెట్టారు. జరగరానిది జరిగితే దానికి బాధ్యత ఎవరు అని మున్సిపల్ కమిషనర్ను ప్రజలు కోరారు, అనంతరం ఆరు రోజుల కిందట ప్రైవేట్ స్కూలు యజమాన్యం ఆరు ఫీట్ల వెడల్పు 20 ఫీట్ల పొడవుతో ఫ్లెక్సీ తయారుచేసి డివైడర్ కు అమర్చినందువలన ఇక్కడ యాక్సిడెంట్లు జరిగే ప్రమాదాలు ఉంటుందన్న విషయాన్ని స్థానిక ప్రజలు యువత తెలిపారు.ఈ విషయము మున్సిపల్ కమిషనర్ తెలియదా అక్కడి నుండి తక్షణమే ఫ్లెక్సీలను తొలగించి ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాల పైన చర్య తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ కు స్థానిక ప్రజలకు యువత కోరడమైనది.

## చిన్నారులకు అక్షరాభ్యాసం

- ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీ



**వనపర్తి, జూన్ 20 (ప్రజాజ్యోతి ):** విద్యా సంవత్సరం ప్రారంభమైన సందర్భంగా శనివారం 1వ వార్డులోని ప్రాథమిక పాఠశాలలో చిన్నారులకు వార్డు కౌన్సిలర్ చుక్క జయశ్రీ రాజు అక్షరాభ్యాసం నిర్వహించి, ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చుక్క జయశ్రీ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డికి నాయకత్వంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచిత దుస్తులు, పాఠ్యపుస్తకాలతో పాటు ఉదయం అల్పాహారం అందించడం అభినందనీయమని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం నూతన విద్యా విధానాన్ని అమలు చేస్తోందని పేర్కొన్నారు. అలాగే స్థానిక ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ అభివృద్ధి పనులు చేపడుతున్నారని తెలిపారు. ఇం దుకు ముఖ్యమంత్రి, ఎమ్మెల్యేలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చంద్రజ్యోతి, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం



**కొల్లాపూర్ జూన్ 20 ప్రజా జ్యోతి** కొల్లాపూర్ నియోజక వర్గం కోడేరు మండలం రాజాపూర్ గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన తప్పెట చిన్నయ్య ఎటువల్లా అనారోగ్యంతో మృతి చెందగా, ఆయన కుటుంబానికి గ్రామ యువకులు ఆర్థిక సహాయం అందించాలనే ఆలోచనతో అమౌంటు 29వేల రూపాయలు ఆర్థిక సహాయం బాధితులు కుటుంబానికి అందజేశారు. గ్రామ యువకులు అసోసియేషన్ అధ్యక్షుడు గుర్రం గడ్డ రాజు మబ్బు రాము స్వేరో పల్లె బొక్కలయ్యా మిద్దె నరసింహ అందరూ యువకులు కలిసి బాధిత కుటుంబానికి అండగా నిలిచి ఆర్థిక సహాయంగా అందజేశారు.

## శనేశ్వర స్వామికి తిలతైల అభిషేక పూజలు

- -పరమ శివునికి దీపారాధనలు




**నాగర్ కర్నూల్ : జూన్ 20 (ప్రజా జ్యోతి )**శ్రీ పరాభవ నామ సంవత్సరం నిజ జేష్ఠ మాసం షష్టి శనివారం,మఖ నక్షత్రము నాడు బీజినేపల్లి మండలం పరిధి లోని నంది వడ్డేమాన్ గ్రామంలో గల శ్రీశనేశ్వర స్వామికి భక్తులచే శని గ్రహ దోష నివారణకు స్వామివారికి తిలతైలా అభిషేఖాలు భక్తితో వేదమంత్రచరణలతో నిర్వహించారు.శ్రీసార్థాసప్త జేష్టమాత సమేత శనేశ్వర స్వామికి శని వారం ప్రత్యేకంగా తిలతైలాభిషేకాల పూజలు నిర్వహించి ఆలయ ప్రధాన అర్చకులు డాక్టర్.గవ్వమఠం విశ్వనాథ శాస్త్రి మాట్లాడుతూ ఈ మాసంలో స్వామివారిని కొలిచిన అత్యధిక సంతృప్తి పొంది విశేష ఫలితాన్ని భక్తులకు ఇస్తారని,ప్రతి ఒక్కరు జన్మ రిత్యా,గోచార రీత్యా శనిగ్రహ దోష నివారణకు స్వామిని శక్తిమేరకు పూజించాలన్నారు.అనంతరం ఆలయంలోగల బ్రహ్మ సూత్రం గల పరమశివునికి భక్తుల ద్వారా రుద్రాభిషేక జలు,అర్చనలు,దీపారాధనలు, నందీశ్వర స్వామికి ప్రత్యేక అర్చనలు,పూజలు భక్తులచే నిర్వహించి,అనంతరం భక్తులకు వేద ఆశీర్వచనం తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.కార్యక్రమంలో ఆలయం చైర్మన్ వెల్దండ గోపాల్ రావు,గ్రామ సర్పంచ్ సుగుణమ్మ, కమిటీ సభ్యులు కెంచె రాజేష్,ప్రభాకరచారి,పుల్లయ్య,అడ్వకేట్ వీర శేఖర్ చారి,శ్రీకాంత్ రెడ్డి,ఆలయ అర్చకులు శాంతి కుమార్,ఉమా మహేశ్వర్,సిబ్బంది గోపాల్ రెడ్డి,భక్తులు పాల్గొన్నారు.

## నిత్యం ప్రజలకు అందుబాటులో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం

- ప్రజా సమస్యల పరిష్కారంలో వెంటనే స్పందిస్తున్న సిబ్బంది



**వనపర్తి, జూన్ 20 (ప్రజాజ్యోతి ):** ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉం టూ వారి సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం సమర్థవంతంగా పనిచేస్తోందని స్థానికులు అభినందిస్తున్నారు. ఖాసీంనగర్ గ్రామానికి చెందిన ఓ రైతు తన గొర్రెలకు వ్యాక్సిన్ అందుబాటులో లేకపోవడంతో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ఆశ్రయించాడు. రైతు సమస్యను విన్న కార్యాలయ సిబ్బంది వెంటనే స్పందించి సంబంధిత వెటర్నరీ ఏ.డి.తో మాట్లాడి వ్యాక్సినేషన్ ఏర్పాట్లు చేయించారు. దీంతో సంతోషం వ్యక్తం చేసిన రైతు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా తమ పిల్లల విద్యాభ్యాసానికి సంబంధించి గురుకులాలు, కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయా లు (కేజీబీవీలు ) ఇతర ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో సీట్ల విషయంలో పలువురు తల్లిదండ్రులు క్యాంపు కార్యాలయాన్ని సంప్రదించా రు. వారి సమస్యలను తెలుసుకున్న సిబ్బంది సంబంధిత అధికారులతో మాట్లా డి అవసరమైన సహాయాన్ని అందించడంతో తల్లిదండ్రులు, విద్యార్థులు ఆనం దం వ్యక్తం చేశారు.కొందరు తల్లిదండ్రులు మాట్లాడుతూ, తమ సమస్యలను వివరించగానే క్యాంపు కార్యాలయ సిబ్బంది వెంటనే స్పందించి పరిష్కార మార్గాలు చూపారని తెలిపారు. ప్రజా సమస్యల పట్ల చూపుతున్న చొరవ, స్పందన తమకు ఎంతో సంతృప్తినిచ్చిందని పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న ఎమ్మెల్యేకు, క్యాంపు కార్యాలయ సిబ్బందికి వారు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఇలాంటి ప్రజా ప్రతినిధిని ఇప్పటివరకు చూడలేదని పలువురు హర్షం వ్యక్తం చేశారు.

# 2028 నాటికి 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే మోదీ లక్ష్యం

- వనపర్తిలో ఘనంగా 'జెన్ జెడ్ నమో కాన్ క్లేవ్' నిర్వహణ
- యువమోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు రుద్రగాని సందీప్ గౌడ్




**వనపర్తి, జూన్ 20 (ప్రజాజ్యోతి):** మోదీ నాయకత్వంలో దేశం వేగవంతమైన అభివృద్ధి సాధించిందని 2028 నాటికి 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే మోదీ లక్ష్యమని యువమోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు రుద్రగాని సందీప్ గౌడ్ అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాలనకు 12 ఏళ్లు పూర్తైన సందర్భంగా శనివారం బీజేపీ జిల్లా కార్యాలయంలో యువమోర్చా జిల్లా అధ్యక్షుడు నల్లవోతుల అరవింద్ ఆధ్వర్యంలో "జెన్ జెడ్ నమో కాన్ క్లేవ్" నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన యువమోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు రుద్రగాని సందీప్ గౌడ్ మాట్లాడుతూ, మోదీ నాయకత్వంలో దేశం వేగవంతమైన అభివృద్ధి సాధించిందన్నారు. జనధన్–ఆధార్–మొబైల్ (జెఎయం) వ్యవస్థ ద్వారా కోట్లాది మంది లబ్ధిదారులకు ప్రత్యక్ష నగదు బదిలీలు జరిగాయని తెలిపారు. స్టార్ట్ అప్ ఇండియా, స్కిల్ ఇండియా, స్టాండ్ అప్ ఇండియా వంటి పథకాలతో యువతకు ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలు విస్తరించాయని పేర్కొన్నారు. డిజిటల్ ఇండియా కార్యక్రమంతో ఇంటర్నెట్ వినియోగం గ్రామీణ ప్రాంతాలకు చేరిందని, యూపీఐ లావాదేవీల్లో భారత్ ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. వైద్య విద్య, ఆరోగ్య రంగం, మౌలిక వసతులు, ఎలక్ట్రానిక్స్ తయారీ, ఎగుమతుల రంగాల్లో గణనీయమైన పురోగతి సాధించిందని చెప్పారు. 2014 తర్వాత భారత ఆర్థిక వ్యవస్థ వేగంగా విస్తరించి, రాబోయే రెండేళ్లలో 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అవతరించే దిశగా దేశం పయనిస్తోందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు డి. నారాయణ, మాజీ జడ్పీ చైర్మన్ రాకాసి లోకనాథ్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దిరాజు, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కొమ్ము శ్రీనివాసులు, ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు రవి నాయక్, యువమోర్చా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రచయిత మద్దిలేటిని సన్మానించిన ఎస్.టి.యు నాయకులు



**నాగర్ కర్నూల్ : జూన్ 20 (ప్రజా జ్యోతి )**నాగర్ కర్నూలు జిల్లా కేంద్రంలో శనివారం స్టేట్ టీచర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఓ సమావేశంలో వనమంచు పల్లె పాటల పుస్తక రచయిత,అభ్యుదయ కవి కల్వకోలు మద్దిలేటిని ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు కొత్త శ్రీధర్ రావు అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా పూర్వ అధ్యక్షుడు పర్వత్ రెడ్డి హాజరయ్యారు. పర్వత్ రెడ్డిమాట్లాడుతూ మట్టి వాసనల గుండెచప్పుడు వనమంచుపల్లె అని అందులోని పాటలు సమాజ మార్పుకు,హితానికి పల్లె ప్రగతికి సోపానాలుగా ఉంటాయనడంలో అతిశయోక్తి లేదని అన్నారు. ప్రతి పాటలో సామాజిక దృక్పథం,పల్లె వాసనలు గుబాళించి ప్రజా చైతన్యంలో తుపాకీ తూ టల్లా దూసుకుపోయి,నెర్రెలుబారిన నేలలో చురకత్తులు మొలిపిస్థాయన్నారు.ప్రజాకవి,గాయకుడు,సంఘ నాయకుడు మద్దిలేటి మాట్లాడుతూ పల్లె జీవనం అక్కడి ప్రకృతి కష్టజీవుల ఆవేదనలే ఈ పాటలకు స్ఫూర్తి అని అన్నారు.హైదరాబాద్ లోని రవీంద్ర భారతిలో గోరటి కన్న,సిధారెడ్డి,సాహితీవేత్తల సమక్షంలో వనమంచు పల్లె పుస్తకం ఆవిష్కరించి తర్వాత నేడు జిల్లా సంఘ భవనంలో ఎస్టి యు కుటుంబ సభ్యులు ఇంత ఘనంగా సన్మానించి బడి బతుకులు,విద్యా పోకడలపై తన కలం, గళం వినిపించాలని కోరడం సంతోషదాయకమన్నారు. స్టేట్ టీచర్స్ యూనియన్ ఆవిర్భవించి నేటికీ 80 వసంతాల ఉత్సవాలకు సిద్ధమైనదని అందులో ఉద్యమ సాంస్కృతిక వైభవాన్ని,ప్రజాగళ గీతంతో ఉత్సాహభరితం గావిస్తాయన్నారు.రాష్ట్ర నాయకులు రమేష్,ప్రభాకర్,అనిల్ కుమార్ రెడ్డి,జిల్లా ప్రధాన కార్యదర్శి మధుసూదన్ రెడ్డి, వనపర్తి జిల్లా కార్యదర్శి హరిప్రసాద్ పాల్గొన్నారు.

## కొల్లాపూర్ రాజకీయ చదరంగంలో ప్రభుత్వ అధికారులు బలి

- సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్



**కొల్లాపూర్ జూన్ 20 ప్రజా జ్యోతి** కొల్లాపూర్ మండలంలో గత కొన్ని నెలలుగా జరుగుతున్న రాజకీయ చదరంగంలో ప్రభుత్వ అధికారులు బలి అవుతున్నారని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ఎండి తీవ్రంగా విమర్శించారు మితిమీరిన రాజకీయ జోక్యం అధికారుల స్వేచ్ఛను హరిస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం కొల్లాపూర్ లో శనివారం రోజు జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, దీని కారణంగా గడిచిన సంవత్సర కాలంలో ఏ అధికారి కూడా సంపూర్ణంగా తమ పదవి కాలాన్ని పూర్తి చేయకుండానే ఇకనుంచి ట్రాన్స్ఫర్లు చేయించుకొని లేదా లీవ్ పై వెళ్ళిపోయి కాలం నిలదీస్తున్నారని ఆయన విమర్శించారు. ప్రజా ప్రతినిధులు ఇతర వ్యక్తుల జోక్యం వలన అధికారులు ఈ రకంగా ఒత్తిడిని లోనై ఇక్కడ నుండి ఎప్పుడు వెళ్ళిపోవాలా అని ప్రయత్నం చేస్తుండగా ఇతర ఏ కొత్త ప్రభుత్వ అధికారి కూడా కొల్లాపూర్ లో ఉద్యోగం చేయడానికి కొల్లాపూర్ కి రావడానికి భయపడుతున్నారని కొల్లాపూర్ పేరు వినగానే వెనుకడుగు చేస్తున్నారని ఆయన తెలిపారు. రాష్ట్రానికి సేవలందించే మంత్రి హోదాలో ఉన్న స్థానిక ఎమ్మెల్యే జూపల్లి కృష్ణారావు ఈ విషయంపై దృష్టి కేంద్రీకరించిన అవసరం ఉందని ఫయాజ్ గుర్తు చేశారు, అధికారులు ఇలా ఒత్తిడికి గురి కావడం వలన ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజా సమస్యలు పరిష్కరించకపోగా నెలల తరబడి ప్రతి చిన్న పని పెండింగ్లో పడి కుంటుపడుతుందని ఆయన తెలిపారు. ఇలాగే సాగుతే కొల్లాపూ ర్ నియోజక వర్గానికి చెడ్డ పేరు రావడం ఖాయమని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు, ప్రభుత్వ అధికారులు ఎవరు కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మీరు స్వేచ్ఛగా పని చేయండి రూల్ ని పద్ధతిని పాటించండి ఇక్కడున్న ప్రజలు ముఖ్యంగా భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ మీకు అండగా ఉంటుందని మీరు స్వేచ్ఛగా ప్రజా సమస్యలు పరిష్కరించే దిశగా మీ ఉద్యోగాలు నిర్వహించం డి. మీకు అండగా మేము ఉంటామని ఆయన భరోసా ఇచ్చారు ఏది ఏమైనా ఒక రు కాదు ఇద్దరు కాదు ప్రతి డిపార్ట్మెంట్లో అధికారులు ఇలా వరుస పెట్టి ట్రాన్స్ఫర్లు చేసుకొని వెళ్లిపోయే పరిస్థితి ఎందుకు వస్తుందో ప్రభుత్వ పెద్దలు ఆలోచన చేసి తక్షణమే స్పందించి పరిస్థితిని చక్కదిద్దాలని లేని పక్షంలో ఈ విషయాన్ని ప్రభుత్వ పెద్దలు దృష్టికి తీసుకెళ్లి లేదా ప్రజా క్షేత్రంలో దీనిపై పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని ఫయాజ్ హెచ్చరించారు. కార్యక్రమంలో. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యురా లు ఆర్ ఇందిరా. మండల కార్యదర్శి తుమ్మల శివుడు. డిహెచ్పిహెచ్ జిల్లా అధ్యక్షు డు తప్పెట కిరణ్ కుమార్. సిపిఐ పట్టణ కార్యదర్శి ఎం డి యూసుఫ్. సహాయ కా ర్యదర్శి రమణ. ఏఐటియుసి నాయకులు చాపల శేఖర్. తదితరులు పాల్గొన్నారు.

## పశువైద్య దవాఖాన భవనాన్ని పరిశీలించిన మండల వెటర్నరీ అధికారి



**కొల్లాపూర్ జూన్ 20 ప్రజా జ్యోతి** గ్రామంలో పశువులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు చర్యలుకొండూరు గ్రామంలో గత కొన్ని సంవత్సరాలుగా వాడుకలో లేక శిథిలావస్థకు చేరుకున్న పశువైద్య దవాఖాన భవనాన్ని మండల వెటర్నరీ అధికారి మౌనిక గ్రామ సర్పంచ్ కేతూరి ధర్మతేజ,మాజీ సర్పంచ్ నల్లపోతుల గోపాల్ లతో కలిసి దవాఖాన భవన ప్రస్తుత పరిస్థితిని పరిశీలించారు.అనంతరం వారు మాట్లాడుతూ గ్రామంలో పశువులు,గొర్రెలు మరియు ఇతర పశుసంపదకు అవసరమైన వైద్య సేవలను అందించేందుకు దవాఖానను పునఃప్రారంభించే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు,పశువైద్య సేవలు అందుబాటులో ఉంటే రైతులు మరియు పశుపోషకులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని,త్వరలోనే దవాఖానను తిరిగి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.గ్రామంలో పశువైద్య దవాఖాన పునఃప్రారంభం కావడం ద్వారా పశుసంపద ఆరోగ్య పరిరక్షణకు తోడ్పడటంతో పాటు రైతులకు మరింత సౌకర్యం కలుగుతుందని గ్రామస్థులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఉపాధ్యాయురాలిగా మారిన కలెక్టర్





**నారాయణపేట ప్రతినిధి జూన్ 20 (ప్రజా జ్యోతి)** నారాయణ పేట జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక ఉపాధ్యాయురాలిగా మారి విద్యార్థులకు పాఠాలు బోధించారు. లెక్కలు సులభంగా ఎలా చేయాలో బోర్డు పై చేసి చూపించారు. ఉట్కూర్ మండలంలోని తిప్రస్ పల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను శుక్రవారం జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా లైబ్రెరీని, మధ్యాహ్న భోజనానికి వినియోగించే నిత్యవసర సరుకులను పరిశీలించారు. మెనూ పాటించకపోవడంపై వంట ఏజెన్సీ నిర్వాహకులపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలలోని 2, 4 వ తరగతి గదుల్లోకి వెళ్ళి బోర్డుపై లెక్కలు చేసి చూపించారు.

**ఉట్కూర్ మండల కేంద్రంలోని పాఠశాలల సందర్శన**

ఉట్కూర్ మండల కేంద్రంలోని శ్రీరామ్ నగర్ వీధిలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ ప్రియాంక సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, మెనూ పాటించాలని ఏజెన్సీ నిర్వాహకులను ఆదేశించారు. ఆయా పాఠశాలల్లో బడి బాట కార్యక్రమం ద్వారా ఎన్ రోల్ మెంట్ ఎంత జరిగిందని హెచ్ ఎం లను అడిగి తెలుసుకున్నారు. శ్రీరామ్ నగర్ పాఠశాలలో బియ్యం పరిశీలించిన కలెక్టర్ బియ్యంలో పురుగులు ఉన్నాయని, బియ్యం బస్తాలను తిరిగి పంపించి, వేరే బియ్యం బస్తాలను తెప్పించుకోవాలని ఆ పాఠశాల హెచ్ ఎం ను ఆదేశించారు. అనంతరం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. ఉపాధ్యాయురాలు చెబుతున్న ఇంగ్లీష్ పాఠం బోధన తీరును పరిశీలించారు. అర్థం కానీ విషయాలను మళ్ళీ టీచర్ ను అడిగి చెప్పించుకోవాలని విద్యార్థినులకు సూచించారు. పదో తరగతి పరీక్షా ఫలితాల్లో అందరూ 550 మార్కులకు పైగా సాధించాలన్నారు. మధ్యాహ్న భోజన నాణ్యత ను పరిశీలించారు. చివరగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి కంప్యూటర్ గదిని పరిశీలించారు. పదో తరగతి గదిలో హిందీ పాఠం బోధన విధానాన్ని చూసి, హిందీలో విద్యార్థులకు ప్రశ్నలు అడిగి సమాధానం రాబట్టారు. పాఠశాలలో మరుగు దొడ్ల ను చూశారు. అందుబాటులో ఉన్న మరుగుదొడ్ల ను వినియోగంలోకి తేవాలన్నారు. పాఠశాల ఆవరణలో ఖాళీగా ఉన్న స్థలంలో మరికొన్ని మరుగు దొడ్లు, అదనపు గదుల నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేయించాలని ఎంపీడీవో కు సూచించారు. పక్కనే ఉన్న ఉర్దూ మీడియం తరగతిని పరిశీలించారు. ఉర్దూ మీడియం కొనసాగుతున్న తరగతి గదులు శిథిలావస్థకు చేరాయని గ్రామ సర్పంచి రేణుకా భరత్ కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, అదనపు గదుల నిర్మాణానికి ప్రతిపాదించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఊట్కూర్ తహసిల్దార్ అశోక్ కుమార్, ఎంపీడీవో కిషోర్ కుమార్, ఎంపీవో బాలాజీ, ఉప సర్పంచి, ఆయా పాఠశాలల హెచ్ ఎం లు పాల్గొన్నారు.

## నాణ్యమైన విత్తనం – అధిక దిగుబడికి పునాది

- - జూన్ 23 నుంచి 29 వరకు జిల్లాలోని రైతు వేదికల్లో విత్తన మేళా

**మహబూబ్‌నగర్, జూన్ 20 (ప్రజాజ్యోతి బ్యూరో)** రైతులకు నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉంచి వ్యవసాయ ఉత్పాదకతను పెంపొందించేందుకు మహబూబ్‌నగర్ జిల్లాలో జూన్ 23 నుంచి 29 వరకు ఏడు రోజులపాటు విత్తన మేళా (సీడ్ మేళా) నిర్వహించనున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి కె. గోవింద్ నాయక్ తెలిపారు. వ్యవసాయ శాఖ డైరెక్టర్, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలోని 17 మండలాల్లో ఎంపిక చేసిన రైతు వేదికలలో ఈ విత్తన మేళా నిర్వహించబడుతుందని వెల్లడించారు. ఈ మేళాలో వివిధ పంటలకు సంబంధించిన ధృవీకరించబడిన నాణ్యమైన విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం సేకరణకు సూచించిన ఏడు రకాల సన్న వరి విత్తనాలతో పాటు అపరాల పంటల విత్తనాలు, నూనెగింజల పంటల విత్తనాలు, వివిధ రకాల కూరగాయల విత్తనాలు విక్రయానికి అందుబాటులో ఉంటాయి. అదేవిధంగా నానో యూరియా, నానో డీఏపీ ఎరువులను కూడా రైతులు కొనుగోలు చేసుకునే అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. రైతులు తమ అవసరాలకు అనుగుణంగా నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేసి సకాలంలో విత్తడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని పేర్కొన్నారు. జిల్లాలోని రైతులు తమ సమీప రైతు వేదికను సందర్శించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ శాఖ విజ్ఞప్తి చేసింది. పెద్ద సంఖ్యలో పాల్గొని విత్తన మేళాను విజయవంతం చేయాలని కోరింది. విత్తన మేళాకు సంబంధించిన పూర్తి వివరాల కోసం రైతులు తమ మండల వ్యవసాయ అధికారులను సంప్రదించాలని జిల్లా వ్యవసాయ అధికారి కె. గోవింద్ నాయక్ సూచించారు.

## ఎరువుల దుకాణాలను తనిఖీ చేసిన కలెక్టర్





**నారాయణపేట ప్రతినిధి జూన్ 20 ప్రజా జ్యోతి** నారాయణపేట జిల్లా ధన్వాడ మండల కేంద్రంలోని ఆగ్రో, హాకా రైతు సేవా కేంద్రాలను శనివారం జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా దుకాణాలలో పత్తి విత్తనాల ప్యాకెట్లను, ఇతర రసాయనిక ఎరువులు, పురుగుల మందుల ను పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్లను చెక్ చేశారు. ఈ సీజన్ లో రైతులకు అవసరమైన ఎరువులన్నీ అందుబాటులో ఉన్నాయా లేదా అని డీలర్లను అడిగి తెలుసుకున్నారు. గోదాముల్లో నిల్వ ఉంచిన యూరియా బస్తాలను ఆమె పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సక్రియా నాయక్, ధన్వాడ తహసిల్దార్ సింధూజ, ఎంపీడీవో అబ్జల్, ఏవో నవీన్ కుమార్, ఆర్. ఐ. నిఖిల్, వ్యవసాయ శాఖ, రెవెన్యూ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## వాసవి క్లబ్ ఆధ్వర్యంలో విస్తృత సేవా కార్యక్రమాలు

- - గోశాల, ఆసుపత్రి, విద్యాసంస్థలు, ఆశ్రమాలకు అవసరమైన సామగ్రి పంపిణీ



**జడ్చర్ల, జూన్ 20 (ప్రజాజ్యోతి)** జడ్చర్ల వాసవి క్లబ్, వాసవి వనిత క్లబ్ ఆధ్వర్యంలో "డౌన్ టు డిస్క్" కార్యక్రమం సందర్భంగా శనివారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక గోశాలలో పశువుల కోసం నీటి తొట్లు, గంపలను పంపిణీ చేశారు. అలాగే ప్రభుత్వ ఆసుపత్రికి రోగులు, సహాయకుల సౌకర్యార్థం సిమెంట్ బెంచ్ ను విరాళంగా అందజేశారు. రక్తదాతల జాబితా బోర్డుతో పాటు అత్యవసర సంప్రదింపు నంబర్ల బోర్డును కూడా ఏర్పాటు చేశారు. ప్రభుత్వ కళాశాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సత్కరించేందుకు షాలువాలను అందజేయడంతో పాటు కళాశాల ప్రాంగణంలో సిమెంట్ బెంచ్ ను ఏర్పాటు చేశారు. అదేవిధంగా సతేశ్వర ఆశ్రమానికి, బాదం సంజీవ్ వృద్ధాశ్రమానికి మెడికల్ కిట్లను పంపిణీ చేసి సేవాభావాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమం వాసవి క్లబ్ అధ్యక్షుడు చెన్నారం దేవరాజ్, వాసవి వనిత క్లబ్ అధ్యక్షురాలు పద్మావతి ఆధ్వర్యంలో నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఇరుకుల ప్రదీప్ కుమార్, కొంపల్లి ప్రశాంత్ హాజరయ్యారు. అలాగే రీజన్ చైర్మన్ కొట్ర మధు, జోన్ చైర్మన్ చిత్తనూరి రామకృష్ణ, రీజన్ సెక్రటరీ లట్టుపల్లి శేఖర్, డిస్ట్రిక్ట్ ఇన్ చార్జ్ సంధ్య బాదం, హెచ్ ఎం నవీన్, ట్రెజరర్ బాదం రఘు, వనిత క్లబ్ ట్రెజరర్ పలుట్ల సంధ్య, మంచాన ప్రసన్న, కంద కృష్ణ, జీపీ గ్రాఫిక్స్ ప్రవీణ్, లక్ష్మయ్య, మేడిశెట్టి సరిత, బాదం సంజు, ప్రదీప్, మహేష్ తదితరులు పాల్గొన్నారు. సమాజ సేవే లక్ష్యంగా వాసవి క్లబ్, వాసవి వనిత క్లబ్ చేపట్టిన ఈ కార్యక్రమాలను స్థానికులు అభినందించారు.

## జడ్చర్ల జర్నలిస్టుల శ్రేయస్సు కోసం అజ్మీర్ దర్గాలో చాదర్ సమర్పణ

- - ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన సీనియర్ రిపోర్టర్ ఖాజా మొయినుద్దీన్



**జడ్చర్ల, జూన్ 20 (ప్రజాజ్యోతి)** రాజస్థాన్ రాష్ట్రంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అజ్మీర్ షరీఫ్ దర్గా ను జడ్చర్లకు చెందిన సీనియర్ రిపోర్టర్ ఖాజా మొయినుద్దీన్ కుటుంబ సభ్యులతో కలిసి సందర్శించి భక్తిశ్రద్ధలతో చాదర్ సమర్పించారు. ఈ సందర్భంగా హజ్రత్ ఖ్వాజా గరీబ్ నవాజ్ దర్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రజలందరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో జీవించాలని, వ్యాపారులు తమ వ్యాపారాల్లో మరింత అభివృద్ధి సాధించాలని, సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం నెలకొనాలని ప్రార్థించారు. ముఖ్యంగా జడ్చర్ల ప్రాంతంలోని జర్నలిస్టులు వృత్తిపరంగా ఉన్నత స్థానాలకు చేరుకోవాలని, విజయాలు, ఆరోగ్యాలతో ముందుకు సాగాలని ప్రత్యేకంగా దువా చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఖాజా మొయినుద్దీన్ మాట్లాడుతూ, అజ్మీర్ దర్గా దేశంలో మత సామరస్యానికి, సోదరభావానికి ప్రతీకగా నిలుస్తోందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరి సంక్షేమం కోసం ప్రార్థించే అవకాశం లభించడం తమ అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. కుటుంబ సభ్యులతో కలిసి నిర్వహించిన ఈ పవిత్ర చాదర్ సమర్పణ కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణంలో భక్తిశ్రద్ధల నడుమ జరిగింది.

## విద్యార్థి దశలో క్రమశిక్షణ చాలా ముఖ్యం

- మహిళల అండగా షీ టీం పోలీసులు
- జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఆదేశాల మేరకు



**నారాయణపేట ప్రతినిధి జూన్ 20 ప్రజా జ్యోతి** నారాయణపేట జిల్లా కేంద్రం లోని బాలికల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో. విద్యార్థులకు మహిళల రక్షణ కొరకు పోలీసు చట్టాల గురించి, షీటీమ్ నిర్వహిస్తున్న విధుల గురించి, షీటీమ్ ద్వారా ఎలా రక్షణ పొందొచ్చు అనే అంశాల గురించి, ర్యాగింగ్ / ఇవిటీ జింగ్ / పోక్సో / షీ టీమ్స్ / యాంటీ హ్యూమెన్ ట్రాఫికింగ్ సైబర్ నేరాలు,నూతన చట్టాల గురించి, మరియు అపరిచిత వ్యక్తుల యొక్క ఫోన్ కాల్స్ మరియు మాటలు నమ్మవద్దు, సోషల్ మీడియాకు ఎంత దూరం ఉంటే భవిష్యత్ అంత మంచిగా ఉంటుంది అని మహిళల భద్రతకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటాం మహిళల భద్రత మా ముఖ్య బాధ్యత. చదువుకునే సమయములో చెడు అలవాట్లకు బానిస కావొద్దు అన్నారు, ప్రతి ఒక్కర చదువుపై దృష్టి సారించాలని తెలిపారు, డ్రగ్స్ మరియు ఇతర మత్తు పదార్థాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. చదువుకోవడం వలన భవిష్యత్తు ఉన్నతంగా ఉంటుందని అన్నారు. పిల్లలను చదివించటానికి తల్లిదండ్రులు చేస్తున్న కష్టాన్ని మనసులో పెట్టుకొని చదువుపై శ్రద్ధ వహించాలని మరియు సామాజిక రుగ్మతల గురించి సెల్ఫోన్ కు ఎంత దూరం ఉంటే అంత మంచిది సెల్ ఫోన్ వల్ల ఎంత మంచి ఉందో అంత చెడు ఉంది దానికి అలవాటు పడి బానిసలు కావద్దు విద్యార్థి దశ చాలా కీలక కష్టపడే తత్వం కష్టపడి చదువుకోవడం చాలా ముఖ్యమని మహిళలను ఎవరైనా వేధింపులకు గురి చేస్తే మరియు అవహేళనగా మాట్లాడిన వెంటనే డయల్ 100 లేదా షిటీమ్ No. 8712670398 నెంబర్ కు ఫోన్ చేసి సమాచారం అందించాలని సమాచార అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచడం జరుగుతుందని తెలిపారు. మరియు నూతన చట్టాల గురించి నూతన చట్టాలలో మహిళల రక్షణకు పెద్దపీట వేయడం జరిగిందని షి టీమ్ పోలీసులు బాలరాజు, చేనప్ప, జ్యోతి, కవిత అవగాహన కల్పించారు.
ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పునకల్‌లో అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి

- గుడిబండలో ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశానికి హాజరు



**అడ్డాకుల, జూన్ 20 ( ప్రజాజ్యోతి)** అడ్డాకుల మండల పరిధిలోని పునకల్ గ్రామంలో శనివారం నిర్వహించిన 18 అడుగుల శ్రీ అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి తన సతీమణి కవితతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దంపతులు ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని స్వామి వారి ఆశీస్సులు పొందారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి అడ్డాకుల మండల పరిధిలోని గుడిబండ గ్రామంలో నిర్వహించిన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కొత్త ఇంటిలోకి ప్రవేశించిన కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు తమ తరపున నూతన వస్త్రాలను అందజేసి ఆశీర్వదించారు. ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# రైతుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు అత్యంత దారుణం

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎస్. రాజేందర్ రెడ్డి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు.



**నారాయణపేట ప్రతినిధి జూన్ 20 ప్రజా జ్యోతి** నారాయణపేట జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రైతుల కోసం పెద్ద పెద్ద మాటలు చెప్పిన రేవంత్ రెడ్డి, అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులను పూర్తిగా విస్మరించారని విమర్శించారు. ఎన్నికల సమయంలో ప్రతి గింజను కొనుగోలు చేస్తామని, రైతు బంధు పెంచుతామని, రైతు బీమాను మరింత బలోపేతం చేస్తామని హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు కేంద్రం కోటా మేరకే పంటలు కొనుగోలు చేస్తామని చెప్పడం రైతులను మోసం చేయడమేనన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని దేశానికే అన్నపూర్ణగా నిలిపిన రైతాంగాన్ని నేడు కష్టాల్లోకి నెట్టే పరిస్థితి కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. 2014కు ముందు 40 లక్షల ఎకరాల పరిధిలో సాగు జరిగేదని, కేసీఆర్ నాయకత్వంలో సాగునీరు, 24 గంటల ఉచిత విద్యుత్, రైతు బంధు, రైతు బీమా వంటి పథకాలతో సాగు విస్తీర్ణం 2 కోట్ల 30 లక్షల ఎకరాలకు పెరిగిందన్నారు. పంజాబ్‌ను తలదన్నే స్థాయిలో ధాన్యం ఉత్పత్తి చేసి దేశంలో ఫుడ్ బౌల్ ఆఫ్ ఇండియాగా తెలంగాణకు గుర్తింపు తీసుకొచ్చిన రైతులు నేడు కరెంట్, ఎరువులు, సాగునీరు, గిట్టుబాటు ధర కోసం ఆందోళన చెందడం దురదృష్టకరమన్నారు. రైతుబంధును పెంచుతామని చెప్పిన ప్రభుత్వం ఇప్పటికీ రైతుబంధు విడుదల విషయంలోనే రైతులను అయోమయంలో ఉంచిందని, రైతు బీమా విషయంలో కూడా స్పష్టత లేక రైతు కుటుంబాలు ఆందోళన చెందుతున్నాయని విమర్శించారు. కేసీఆర్ హయాంలో రైతు ఎరువుల కోసం కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి లేదని, అవసరమైతే ఆటోల ద్వారా నేరుగా రైతుల వద్దకే ఎరువులు చేరవేసే విధంగా చర్యలు తీసుకునేవారమన్నారు. ప్రస్తుతం యాప్ పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, గ్రామీణ ప్రాంత రైతులకు యాప్‌పై సరైన అవగాహన లేకపోయినా ప్రభుత్వం, అధికారులు ప్రచారం చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. ఎరువుల కోసం రైతులు రోజులు తరబడి ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడిందని, రైతుల కష్టాలు ప్రభుత్వానికి కనిపించడం లేదన్నారు. నారాయణపేట నియోజకవర్గంలో వరి, మొక్కజొన్న, పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు ప్రధాన పంటలని, రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. వరి, మొక్కజొన్న, పప్పులు, నువ్వులు, చిరుధాన్యాలు సహా అన్ని పంటలకు గిట్టుబాటు ధర ప్రకటించి రైతులకు భరోసా కల్పించాలని కోరారు. అదే సమయంలో నారాయణపేట జిల్లాలో ప్రజా సమస్యలు కూడా పేరుకుపోతున్నాయని అన్నారు. నారాయణపేట–కోటకొండ రహదారి పనులు సంవత్సరాలుగా అసంపూర్తిగా ఉండి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, రోడ్డు పూర్తి చేయాలని అఖిలపక్షంగా అన్ని రాజకీయ పార్టీలు కలిసి ధర్నా చేస్తే సమస్య పరిష్కరించాల్సిన ప్రభుత్వం ఉద్యమం చేసిన నాయకులకు పోలీసుల ద్వారా నోటీసులు పంపించడం ప్రజాస్వామ్య విరుద్ధమని మండిపడ్డారు. ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే కేసులు, ఉద్యమాలు చేస్తే నోటీసులు, ప్రభుత్వ వైఫల్యాలను బయటపెడితే బెదిరింపులు, ప్రజల తరపున వార్తలు ప్రసారం చేసే మీడియా సంస్థలపై ఒత్తిళ్లు తీసుకురావడం కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి నిదర్శనమని ఆరోపించారు. రాష్ట్రంలో రైతు, నిరుద్యోగి, విద్యార్థి, మహిళ, ఉద్యోగి, సామాన్య ప్రజలు అందరూ కాంగ్రెస్ పాలనతో నిరాశకు గురయ్యారని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ పార్టీ రైతులతో కలిసి ఉద్యమిస్తుందని, ప్రభుత్వం రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేసే వరకు పోరాటం కొనసాగిస్తామని, ప్రజా సమస్యలపై వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని రాజేందర్ రెడ్డి స్పష్టం చేశారు.

## ఉద్దండాపూర్ ప్రాజెక్టుపై రాజకీయాలు వద్దు

- నిర్వాసితుల అభ్యున్నతే మా ధ్యేయం : మాజీ మంత్రి డా. సి. లక్ష్మారెడ్డి



**జడ్చర్ల, జూన్ 20 ( ప్రజాజ్యోతి )** ఉద్దండాపూర్ ప్రాజెక్టు, పాలమూరు –రంగారెడ్డి ప్రాజెక్టుల విషయంలో రాజకీయ విమర్శలు కాకుండా నిర్వాసితుల సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా ఉండాలని మాజీ మంత్రి డా. సి. లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం జడ్చర్ల అంబేద్కర్ కళాభవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం చేపట్టిన తొలి భారీ నీటిపారుదల ప్రాజెక్టు పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు అని పేర్కొన్న ఆయన, ఈ ప్రాజెక్టు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా రైతాంగానికి వరంగా మారుతుందని తెలిపారు. ప్రాజెక్టు భూసేకరణ, నిర్మాణ పనులకు కాంగ్రెస్ నాయకులే అడ్డంకులు సృష్టించారని, కోర్టుల్లో కేసులు వేయడం వల్ల పనులు ఆలస్యమయ్యాయని ఆరోపించారు. అదే నాయకులు ఇప్పుడు ప్రాజెక్టు పూర్తికాలేదని విమర్శించడం ఆశ్చర్యకరమన్నారు. కాళేశ్వరం కార్పొరేషన్ నిధులతో పాలమూరు –రంగారెడ్డి ప్రాజెక్టు పనులు చేపట్టామని, ఉద్దండాపూర్ ప్రాజెక్టును మూడు ప్యాకేజీలుగా అమలు చేశామని తెలిపారు. ఇతర రిజర్వాయర్లతో పోలిస్తే ఉద్దండాపూర్ పనులు ఆలస్యంగా ప్రారంభమైనప్పటికీ, రైతులకు గరిష్ఠ ప్రయోజనం చేకూరేలా ప్రణాళిక రూపొందించామని చెప్పారు. 2019లో ప్రాజెక్టు పనులు ప్రారంభమయ్యాయని, కరోనా ప్రభావంతో పనుల వేగం తగ్గినప్పటికీ బీఆర్ఎస్ ప్రభుత్వం రెండున్నర సంవత్సరాల్లో సుమారు రూ.5,000 కోట్లు ఖర్చు చేసిందన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నర సంవత్సరాల్లో కేవలం రూ.500 కోట్లు మాత్రమే విడుదల చేసిందని విమర్శించారు. భూ నిర్వాసితులకు అందించే పరిహారాన్ని రూ.11 లక్షల నుంచి రూ.16.30 లక్షలకు పెంచామని, ప్రజల ప్రయోజనాల దృష్ట్యా ఆ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ఎన్నికల సమయంలో రూ.25 లక్షల ప్యాకేజీ ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆ మేరకు అమలు చేయలేదని ఆరోపించారు. ఆర్ అండ్ ఆర్ (పునరావాసం, పునరుద్ధరణ) ప్యాకేజీ అమలులో ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శించిందని, మూడు వేల కుటుంబాల సర్వే కూడా ఆలస్యమైందన్నారు. తమ హయాంలో పూర్తి స్థాయి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ అమలుకు ప్రణాళిక రూపొందించి, రూ.70 కోట్ల విడుదలకు సిద్ధంగా ఉంచామని వెల్లడించారు. ఆర్ అండ్ ఆర్ సెంటర్ కోసం సుమారు 300 ఎకరాల భూమిని సేకరించామని, తాము శంకుస్థాపన చేసిన పనులే ప్రస్తుతం కొనసాగుతున్నాయని తెలిపారు. భూ నిర్వాసితులకు ప్రతి దశలో అండగా నిలిచామని, భూమి ధరను గజానికి రూ.1,500 నుంచి రూ.3,000కు పెంచినట్లు చెప్పారు. నిర్మాణంలో ఉన్న ఆర్ అండ్ ఆర్ కాలనీ జడ్చర్లలోనే అత్యుత్తమ కాలనీగా నిలుస్తుందని, భవిష్యత్తులో అక్కడ భూముల విలువ గజానికి రూ.30 వేల వరకు పెరిగే అవకాశం ఉందన్నారు. దళిత బంధు, గొర్రెల పంపిణీ, బీసీ బంధు వంటి సంక్షేమ పథకాలను అర్హులైన వారికి అందించామని పేర్కొన్న ఆయన, ఉద్దండాపూర్ అంశంలో రెండున్నర సంవత్సరాల పాటు రాజకీయాలకు దూరంగా ఉండి నిర్వాసితుల సంక్షేమానికే ప్రాధాన్యం ఇచ్చామని తెలిపారు. "రాజకీయాలు కాదు... నిర్వాసితుల అభ్యున్నతే మా ధ్యేయం" అని డా. సి. లక్ష్మారెడ్డి స్పష్టం చేశారు.

## యోగ డే ఆకారంలో విద్యార్థులు

- జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భారతి




**నారాయణపేట ప్రతినిధి జూన్ 20 ప్రజాజ్యోతి** శనివారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జాజాపూర్ లో విద్యార్థులు యోగ ఆకారంలో కూర్చోవడం జరిగింది ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భారతి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం జూన్ 21 అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకుంటారని ప్రాచీన భారతీయ సాంప్రదాయమైన యోగ ప్రపంచవ్యాప్తంగా ప్రోత్సహించడం ప్రయోజనాల గురించి అవగాహన కల్పించడం లక్ష్యంగా నిర్వహిస్తున్నారు ప్రతి సంవత్సరానికి యోగ డేకు ఒక థీమ్ ఉంటుంది యోగా వలన మానసిక శారీరిక శ్రేయస్సు తో పాటు పర్యావరణ సామరస్యాన్ని పెంపొందించడం దీని ఉద్దేశము అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం భాను ప్రకాష్ నరసింహులు శశిరేఖ నర్సింలు మరియు ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు

# పునకల్‌లో 18 అడుగుల అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ

- విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించిన కార్యక్రమం



**అడ్డాకుల, జూన్ 20 ( ప్రజా జ్యోతి )** అడ్డాకుల మండల పరిధిలోని పునకల్ గ్రామంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో 18 అడుగుల అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ ఎంపీపీ దోనూరు నాగార్జున రెడ్డి, భాగ్యలక్ష్మి దంపతులు కుటుంబ సభ్యులతో కలిసి హాజరై విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ప్రారంభించారు. భారత శ్రీ శ్రీ విద్యారణ్య భారత స్వామి ప్రత్యేక అతిథిగా పాల్గొని ఆధ్యాత్మిక సందేశం అందించారు. ఈ సందర్భంగా విద్యారణ్య భారత స్వామి మాట్లాడుతూ భారతీయ గురుకుల విద్యా విధానం, సంస్కృతి, సాంప్రదాయాల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. నేటి తరం పిల్లలకు భారతీయ విలువలు, ఆధ్యాత్మిక చింతన, వేమన శతకం, భాస్కర శతకం వంటి సాహిత్య సంపదను పరిచయం చేయాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. దేవాలయాలు సమాజానికి ప్రశాంతతను, ఆధ్యాత్మిక చైతన్యాన్ని అందించే కేంద్రాలుగా నిలుస్తాయని పేర్కొన్నారు. అభయాంజనేయ స్వామి ఆలయ నిర్మాణం కోసం పునకల్ గ్రామానికి చెందిన సింగిరెడ్డి సతీష్‌రెడ్డి 1,500 గజాల స్థలాన్ని విశ్వహిందూ పరిషత్‌కు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, విశ్వహిందూ పరిషత్ నాయకులు, భక్తులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. 18 అడుగుల అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠతో పునకల్ గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

## నాపై ఎలాంటి కేసులు లేవు.. అసత్య ప్రచారాలు ఆపాలి:

- డి సి సి మాజీ అధ్యక్షుడు శివకుమార్ రెడ్డి



**నారాయణ పేట ప్రతినిధి జూన్ 20 ప్రజా జ్యోతి** నారాయణపేట జిల్లా కేంద్రంలోని సివిఆర్ శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మాజీ జిల్లా అధ్యక్షుడు శివకుమార్ రెడ్డి తనపై ఇటీవల ప్రచారంలోకి వచ్చిన ఆరోపణలు, కథనాలపై స్పందించారు. తనపై ప్రస్తుతం ఎలాంటి కేసులు లేవని, గతంలో నమోదైన కేసులు కూడా సరైన ఆధారాలు లేక కోర్టుల్లో నిలవలేదని స్పష్టం చేశారు. తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ వ్యవహారంలో తన పేరును అనవసరంగా లాగుతూ కొన్ని మీడియా సంస్థలు అసత్య కథనాలు ప్రచారం చేస్తున్నాయని ఆరోపించారు. వాస్తవాలను తెలుసుకోకుండా తనపై బురదజల్లే ప్రయత్నాలు జరుగుతున్నాయని, దీనివల్ల తాను, తన కుటుంబ సభ్యులు తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తాను ప్రజలకు దూరంగా లేనని, నారాయణపేటలోనే ఉంటూ పార్టీ కార్యక్రమాలు, సేవా కార్యక్రమాలు, ప్రజా సమస్యల పరిష్కారానికి సంబంధించిన కార్యక్రమాల్లో నిరంతరం పాల్గొంటున్నానని తెలిపారు. ప్రజల్లో కనిపించడం లేదంటూ చేస్తున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని అన్నారు. తన కోడలు, నారాయణపేట ఎమ్మెల్యే పర్ణిక రెడ్డి సహకారంతో ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. సాగునీటి ప్రాజెక్టులు, చెరువుల అభివృద్ధి, రైల్వే లైన్, రహదారుల విస్తరణ వంటి అనేక అభివృద్ధి పనులు ప్రస్తుతం కొనసాగుతున్నాయని చెప్పారు. తనపై అసత్య ప్రచారాలు చేసే వారు వాస్తవాలను పరిశీలించి మాట్లాడాలని సూచించారు. అవసరమైతే తప్పుడు ప్రచారాలు చేస్తున్న వారిపై పరువు నష్టం దావా వేయడానికి కూడా వెనుకాడబోనని హెచ్చరించారు. మీడియా బాధ్యతాయుతంగా వ్యవహరించి నిజానిజాలను ప్రజలకు తెలియజేయాలని కోరారు.

# నీట్ పరీక్షలకు మహబూబ్‌నగర్ పోలీసుల పటిష్ట భద్రతా ఏర్పాట్లు

- 13 పరీక్షా కేంద్రాల వద్ద 360 మంది పోలీసులతో బందోబస్తు
- విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక చర్యలు




**మహబూబ్‌నగర్, జూన్ 20 ( ప్రజా జ్యోతి బ్యూరో)** ఆదివారం నిర్వహించనున్న నీట్ యుజి-2026 పరీక్షల నిర్వహణకు మహబూబ్‌నగర్ జిల్లా పోలీసు శాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. పరీక్షలు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు జిల్లా వ్యాప్తంగా పటిష్ఠ భద్రతా చర్యలు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ దరావత్ జానకి వెల్లడించారు. జిల్లాలో మొత్తం 13 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా, అందులో మహబూబ్‌నగర్ పట్టణంలో 12 కేంద్రాలు, జడ్చర్లలో ఒక కేంద్రం ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు సమయానికి కేంద్రాలకు చేరుకునేలా ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద ప్రత్యేక పోలీసు బందోబస్తుతో పాటు లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించారు. ప్రతి రూట్‌కు ఎస్ఐ, సీఐ స్థాయి అధికారులను రూట్ అధికారులుగా నియమించగా, జిల్లా వ్యాప్తంగా పర్యవేక్షణ కోసం ముగ్గురు డీఎస్పీలను నియమించారు. బందోబస్తు నిర్వహణను ఇద్దరు అదనపు ఎస్పీలు పర్యవేక్షిస్తుండగా, జిల్లా ఎస్పీ స్వయంగా సూపర్వైజింగ్ అధికారిగా పర్యవేక్షిస్తున్నారు. మొత్తం 360 మంది పోలీసు సిబ్బంది భద్రతా విధుల్లో పాల్గొంటున్నారు. పరీక్షా కేంద్రాల సమీపంలోని జిరాక్స్ సెంటర్లు, ఇంటర్నెట్ సెంటర్లు, బుక్ స్టాల్స్ పరీక్ష సమయాల్లో తప్పనిసరిగా మూసివేయాలని పోలీసు శాఖ ఆదేశాలు జారీ చేసింది. విద్యార్థులు హాల్ టికెట్‌లో పేర్కొన్న సూచనలను తప్పనిసరిగా పాటించాలని ఎస్పీ సూచించారు. పరీక్ష మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5.15 గంటల వరకు నిర్వహించబడుతుందని, ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు మాత్రమే పరీక్షా కేంద్రాల్లోకి అనుమతి ఉంటుందని తెలిపారు. 1.30 గంటల తర్వాత గేట్లు మూసివేస్తారని పేర్కొన్నారు. ఎలక్ట్రానిక్ పరికరాలు, మొబైల్ ఫోన్లు, బ్లూటూత్ డివైస్‌లు, స్మార్ట్ వాచీలు, ఆభరణాలు, ఇతర లోహ వస్తువులు పరీక్షా కేంద్రాలకు తీసుకురావద్దని సూచించారు. ట్రాఫిక్, భద్రతా ఏర్పాట్లలో పోలీసులకు సహకరించాలని కోరారు. విద్యార్థుల సౌకర్యార్థం అన్ని పరీక్షా కేంద్రాలకు సంబంధించిన గూగుల్ మ్యాప్ లింకులను జిల్లా పోలీసు శాఖ అందుబాటులో ఉంచింది. హాల్ టికెట్‌లో పేర్కొన్న కేంద్రాన్ని ముందుగానే గుర్తించి, సమయానికి చేరుకోవాలని సూచించింది. నీట్ యుజి - 2026 పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులందరికీ జిల్లా పోలీసు శాఖ తరపున జిల్లా ఎస్పీ జానకి శుభాకాంక్షలు తెలియజేశారు. పరీక్షలను ప్రశాంతంగా, ఆత్మవిశ్వాసంతో రాయాలని సూచించారు.

## నాలుగు కోట్ల నిధులతో నర్వలో మినీ స్టేడియం గ్రౌండ్ నిర్మాణానికి సీఎం రేవంత్ రెడ్డి గ్రీన్ సిగ్నల్



**నర్వ జూన్ 20 ప్రజా జ్యోతి** నారాయణపేట్ జిల్లా నర్వ మండల కేంద్రంలో మినీ స్టేడియం గ్రౌండ్ నిర్మాణానికి నాలుగు కోట్ల నిధులను మంజూరు చేస్తున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి, శనివారం హైదరాబాదులోని గచ్చిబౌలి, ఎల్బీ స్టేడియం గ్రౌండ్లో రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాతో కలిసి, రాష్ట్రవ్యాప్తంగా ఆయా జిల్లాలలో క్రీడా మైదానాల నిర్మాణాలకు 50, 73 కోట్ల నిధులను విడుదల చేస్తున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు, ఇందులో భాగంగా నర్వ మండలం కేంద్రంలో ఏడాదికితం మంత్రి వాకిటి శ్రీహరి ఆధ్వర్యంలో జాంద్రగుట్ట వద్ద ఐదున్నర ఎకరాలలో స్టీరింగ్ గ్రౌండ్ కోసం శంకుస్థాపన చేసిన అడ్డు స్థలంలో స్టేడియం నిర్మాణానికి ప్రస్తుతం నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు, ఇదేవిధంగా మక్తల్ మండలం మాగనూరు మండలాలకు కూడా క్రీడా ప్రాంగణాలకు నిధులు మంజూరు చేయడం పట్ల నర్వ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బియ్యం చెన్నయ్య సాగర్ తో పాటు కాంగ్రెస్ నాయకులు, మక్తల్ నియోజకవర్గం ప్రజలు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రైవేటు పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి

- టిఆర్ఎస్ నాయకుల నిరసన

**నర్వ జూన్ 20 ప్రజా జ్యోతి** నారాయణపేట జిల్లా నర్వ మండలం తో పాట గ్రామాలలో ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులకు మౌలిక వసతులతో పాటు ఫీజులను తగ్గించాలని డిమాండ్ చేస్తూ. టిఆర్ఎస్ మండల పార్టీ ఆధ్వర్యంలో శనివారం మండల విద్యాశాఖ అధికారులకు వినతి పత్రం సమర్పించి నిరసన వ్యక్తం చేశారు, ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ మండల నాయకులు మ్యాతరి శంకర్, గోపి రాజారెడ్డి డీకే జనార్దన్, వెంకట్ రెడ్డి మహేష్ గౌడ్, కొత్తపల్లి అశోక్, ప్రవీణ్ గౌడ్ నవీన్ యాదవ్,రాములు గౌడ్, రాకేష్ గౌడ్, రాకేష్ గౌడు రమేష్‌కె, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

## లోక్ అదాలత్‌లో 5,264 కేసుల పరిష్కారం

- సామరస్య పరిష్కారాలకు లోక్ అదాలత్ వేదిక




**వనపర్తి, జూన్ 20 (ప్రజాజ్యోతి):** జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం వనపర్తి టౌన్, ఆత్మకూరు కోర్టులో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో మొత్తం 5,264 కేసులు పరిష్కారమయ్యాయి. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి జి. కళార్చన మాట్లాడుతూ జిల్లాలోని వివిధ కోర్టుల పరిధిలో 11 సివిల్ కేసులు, 1,527 క్రిమినల్ కేసులు, 3,726 ప్రీ-లిటిగేషన్ కేసులు పరిష్కరించబడినట్లు తెలిపారు. ప్రజలు తమ వివాదాలను సత్వరంగా, సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవడానికి లోక్ అదాలత్‌లు సమర్థవంతమైన వేదికగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి కే. కవిత, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి టి. కార్తీక్ రెడ్డి, ఫస్ట్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి బి. శ్రీలత, సెకండ్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఎన్. అశ్విని, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కిరణ్ కుమార్, డీఎస్పీ గిరిధర్ రావు, సీనియర్ న్యాయవాదులు, న్యాయవాదులు, పోలీసు సిబ్బంది, కోర్టు సిబ్బంది, లోక్ అదాలత్ సిబ్బంది పాల్గొన్నారు.